సాక్షి
కుమురం భీం
బుధవారం, 1, మే, 2024

'ఆయన' గెలిచారు..



2004లో మధుసూదన్‌రెడ్డి ఆదిలాబాద్ ఎంపీగా ఎన్నికవగా అప్పటికే ఆయన భార్య కోమాలో ఉన్నారు. భర్త గెలిచిన విషయం కూడా తెలియకుండానే కోమాలోనే ఆమె కన్ను మూశారు. IIలో▸

నేటి నుంచి సమ్మర్ క్యాంపులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో నేటి నుంచి ఈ నెల 31 వరకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డీటీడీవో రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 11 క్రీడలకు సంబంధించి వేసవి క్రీడా శిబిరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 43.7 /27.7

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉదయం 9 గంటల నుంచి వేడి పెరుగుతుంది. ఉక్కపోత అధికంగా ఉంటుంది

న్యూస్‌రీల్

జిల్లాలో 30 పోలీసు యాక్ట్ అమలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో శాంతిభద్రతలు, ప్రశాంతత పెంపొందించేందుకు మే 1 నుంచి 31వ తేదీ వరకు 30 పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని ఎస్పీ సురేశ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పోలీసు యాక్ట్ అమలులో ఉన్నందున సబ్ డివిజనల్ పోలీసు అధికారి, ఉన్నతాధికారుల నుంచి అనుమతి లేకుండా పబ్లిక్ సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించొద్దన్నారు. ప్రజలు శాంతిభద్రతల రక్షణకు సహకరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'పద్మశ్రీ' కనక రాజుకు సన్మానం



కనక రాజును సన్మానిస్తున్న నాయకులు

జైనూర్(ఆసిఫాబాద్): మండలంలోని మార్లవాయి గ్రామంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజును మంగళవారం బీజేపీ నాయకులు సంపర్క్ సే సమర్థన్ అభియాన్‌లో భాగంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గిరిజన గ్రామం మార్లవాయిలోని నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తిని పద్మశ్రీ పురస్కారం వరించడం గొప్ప విషయమన్నారు. హైమన్ డార్ఫ్ వంటి మహనీయులకు ఆశ్రయం కల్పించిన గొప్ప గ్రామం మార్లవాయి అని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట్నక విజయ్‌కుమార్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రే విశాల్, ఆసిఫాబాద్ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, నాయకులు సుచిత్, దౌలత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు కలెక్టర్ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, డీఐఈవో శంకర్

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపిన 11 మంది విద్యార్థులను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, డీఐఈవో శంకర్ అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ ఫలితాల్లో జిల్లా రాష్ట్రస్థాయిలో ఏడో స్థానంలో నిలవడం సంతోషకరమన్నారు. వచ్చే ఏడాది మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు అధ్యాపకులు కృషి చేయాలన్నారు. విద్యార్థులు తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని ఉన్నత చదువులు చదవాలని ఆయన సూచించారు.

సీఎం సభకు చురుగ్గా ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి గురువారం జిల్లా కేంద్రానికి రానున్నారు. ఈ మేరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాదరావు, స్థానిక నాయకులు సీఎం పర్యటనకు ఏర్పాట్లు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో జిల్లా కేంద్రానికి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల ముందు సీఎం హోదాలో జిల్లాకు వస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ పక్కన ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో పాల్గొననున్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో ద్వారా గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు జిల్లా కేంద్రానికి సీఎం చేరుకుని బహిరంగ సభలో ప్రసంగిస్తారని డీసీసీ విశ్వప్రసాదరావు తెలిపారు. కాగా.. సభాస్థలి వద్ద ఏర్పాట్లను మంగళవారం రాత్రి ఎస్పీ సురేశ్‌కుమార్ పరిశీలించారు. సభాస్థలి, హెలిప్యాడ్, వీఐపీ పార్కింగ్, ట్రాఫిక్ రూట్లు, సభాస్థలికి వచ్చి, వెళ్లే రహదారులు, జనరల్ పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. బందోబస్తుపై అధికారులకు సూచనలు చేశారు. అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, సీఐ సతీశ్, ఎస్సైలు ఉన్నారు.

'పది'లో నిరాశ..!

- ఫలితాల్లో మళ్లీ వెనుకబడిన కుమురంభీం ఆసిఫాబాద్
- రాష్ట్రస్థాయిలో 31వ స్థానంలో జిల్లా
- 6,393 మంది విద్యార్థులకు 5,325 మంది పాస్
- 83.29 శాతం ఉత్తీర్ణత నమోదు
- 10 జీపీఏ సాధించిన ఎంజేపీ గురుకుల విద్యార్థి



ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఫలితాల్లో మళ్లీ వెనుకబడిపోయింది. ఉపాధ్యాయుల కొరత, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పాఠశాలలకు హాజరు కాకపోవడం వంటి కారణాలతో ఉత్తీర్ణత శాతం తగ్గినట్లు తెలుస్తోంది. కొన్నేళ్లుగా ఇవే ఫలితాలు పునరావృతమవుతుండటంపై జిల్లా విద్యాశాఖపై విమర్శలు వస్తున్నాయి. 15 మండలాల పరిధిలో మొత్తం 170 ఉన్నత పాఠశాలల నుంచి 6,393 మంది విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 5,325 మంది పాసయ్యారు. బాలురు 3,008 మంది పరీక్షలు రాయగా 2,366 మంది ఉత్తీర్ణత(78.66 శాతం), బాలికలు 3,385 మంది పరీక్షలు రాయగా 2,959 మంది(87.42 శాతం) ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రస్థాయిలో జిల్లా 31వ స్థానంలో నిలిచింది.

మూడేళ్లుగా 'పది' ఫలితాలు

సంవత్సరం	హాజరైనవారు	ఉత్తీర్ణులు	శాతం	జిల్లాస్థానం
2021- 22	7,007	5,605	79	32
2022- 23	6,670	5,061	75	30
2023- 24	6,393	5,325	83	31



సత్తా చాటిన 'ప్రభుత్వ' విద్యార్థులు

పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పలువురు మెరుగైన జీపీఏ సాధించారు. జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయం (బాలురు)లో 72 మంది విద్యార్థులకు 70 మంది(97శాతం) పాసయ్యారు. ఈ పాఠశాలకు చెందిన సత్యనారాయణ 10/10 జీపీఏ సాధించి జిల్లా టాపర్‌గా నిలిచాడు. అలాగే జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన లక్ష్మణ్, తరన్నుం, సాయి 10 జీపీఏ సాధించారు. పట్టణంలోని తెలంగాణ మోడల్ స్కూల్ నుంచి 100 మంది పరీక్షలకు హాజరైతే 95 మంది ఉత్తీర్ణులయ్యారు. భావన, మనస్విత, తిరోజ 9.8 జీపీఏ సాధించారు. వేదాక్షర 9.7, గీతారాణి 9.5, అశ్రిత, జశ్వంత్, రుకం జశ్వంత్ 9.5 జీపీఏ, వర్షిత, అక్షయ 9.3 జీపీఏ సాధించారు. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకులం నుంచి శ్రీనివాస్ 9.8, ఆదర్శ 9.5, గిరిజన బాలికల గురుకులానికి చెందిన భూదేవి 9.8 జీపీఏతో మెరిశారు. గిరిజన బాలుర గురుకులంలో 44 మందికి 40 మంది(68 శాతం), సాంఘిక సంక్షేమ గురుకులంలో 72 మందికి 70 మంది(98 శాతం), గిరిజన బాలికల పాఠశాలలో 77 మందికి 72 మంది(98 శాతం), ఆసిఫాబాద్ కేజీబీవీలో 41 మందికి 35 మంది(97 శాతం), ఆశ్రమ బాలికల పాఠశాలలో 43 మందికి 24 మంది(77 శాతం), ఆశ్రమ బాలుర పాఠశాలలో 48 మందికి 27 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంజేపీ పాఠశాల(బాలికల)లో 55 విద్యార్థినులకు 54 మంది(99 శాతం) ఉత్తీర్ణులు కాగా.. స్వాతి 9.5 జీపీఏ, సింధూజ 9.3 జీపీఏ సాధించారు. అలాగే మైనార్టీ బాలికల పాఠశాలలో 57 మందికి 53 మంది(93 శాతం) పాసయ్యారు. లిఖిత, షేక్ ఆయిషా 9.3 జీపీఏతో సత్తా చాటారు. ఆసిఫాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో 70 మందికి 35 మంది(50 శాతం) మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. బాలికల ఉన్నత పాఠశాలలో 84 మందికి 37 మంది, జన్కాపూర్ ఉన్నత పాఠశాలలో 86 మందికి 35 మంది, బూర్గుడ ఉన్నత పాఠశాలలో 64 మందికి 36 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఫలితాలపై డీటీడీవో హర్షం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించడంపై డీటీడీవో రమాదేవి హర్షం వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని 37 ఉన్నత పాఠశాలల్లో 1,162 మంది విద్యార్థులకు 1,065 మంది(91శాతం) ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. పది పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయని పేర్కొన్నారు.



సత్యనారాయణ,10/10



భావన, 9.8 జీపీఏ



తిరోజ, 9.8 జీపీఏ



మనస్విత, 9.8 జీపీఏ



వేదాక్షర 9.7 జీపీఏ



శ్రీనివాస్ 9.8 జీపీఏ



భూదేవి 9.8 జీపీఏ



ఆదర్శ 9.5 జీపీఏ



స్వాతి 9.5 జీపీఏ



లిఖిత 9.3 జీపీఏ

తాజ్‌బాబా పాస్



పరీక్ష కేంద్రం వద్ద తాజ్‌బాబా(ఫైల్)

కౌటాల(సిర్పూర్): కౌటాల మండలం ముత్తంపేట గ్రామానికి చెందిన షేక్ జలీల్, తహెరా దంపతుల కుమారుడు తాజ్‌బాబా పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు. షేక్ జలీల్ గ్రామంలో బైక్ పంక్చర్ షాపు నిర్వహిస్తుండగా.. తహెరా కౌటాలలోని భవిత కేంద్రంలో ఆయాగా పని చేస్తోంది. పుట్టుకతోనే అంధుడైన తాజ్‌బాబా మానసిక సమస్యలతోనూ బాధపడుతున్నాడు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి, అదే పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని స్వాతి సాయంతో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యాడు. తాజాగా వెలువడిన ఫలితాల్లో 6.8 జీపీఏ సాధించాడు. విద్యార్థిని హెచ్‌ఎం గావుడే హన్మంతు, స్థానికులు అభినందించారు.

ఇక్కడ అందరూ పాసయ్యారు

కెరమెరి(ఆసిఫాబాద్): జిల్లాలో పలు పాఠశాలలు మెరుగైన ఉత్తీర్ణత సాధించడంలో వెనుకబడినా.. కొన్ని స్కూళ్లు మాత్రం వందశాతం ఫలితాలతో మెరిశాయి. లింగాపూర్, సిర్పూర్(యూ) కస్తూరిబా గాంధీ విద్యాలయాలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. లింగాపూర్ మండలం కంచన్‌పల్లి ఆశ్రమ పాఠశాలలో సైతం పరీక్షకు హాజరైన విద్యార్థులందరూ పాసయ్యారు. పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్ ఆశ్రమ పాఠశాలలో 16 మందికి 16 మంది ఉత్తీర్ణులయ్యారు. రెబ్బెన మండలంలోని నంబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల కేంద్రంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్ వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. రాంజీగూడ ఆశ్రమ పాఠశాలలో 16 మందికి 16, హట్టి ఆశ్రమ పాఠశాలలో 46 మందికి 46 మంది పాసయ్యారు. వందశాతం ఉత్తీర్ణత సాధించడంపై ప్రధానోపాధ్యాయులు ప్రేందాస్, లింబారావు హర్షం వ్యక్తం చేశారు.

ఫలించిన కృషి

కెరమెరి మండలంలో ఝరి ఉర్దూ మీడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2011లో ప్రారంభమైంది. ఈ ఏడాది మొత్తం 13 మంది విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యారు. ఏడుగురు ఉపాధ్యాయులు పని చేయాల్సిచోట కేవలం ముగ్గురు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వందశాతం ఉత్తీర్ణత కోసం జూన్ నుంచే ప్రత్యేక ప్రణాళికతో విద్యాబోధన చేశారు. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల శ్రమతో ఉత్తమ ఫలితాలు సాధించగలిగామని హెచ్‌ఎం రుక్సానా బేగం తెలిపారు.

అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: రాజకీయ పార్టీలు సభలు, సమావేశాల నిర్వహణ, ఇతర అనుమతుల కోసం సువిధ యాప్‌లో 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి మంగళవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటస్టికల్ సర్వేలయన్స్ టీం, విడతల వారీగా విధులు నిర్వహిస్తున్నాయన్నారు. వీడియో తీసిన అనంతరం వ్యూయింగ్ తర్వాత అభ్యర్థుల ఖర్చుల వివరాలు అభ్యర్థులకు వెళ్తాయన్నారు. మే 3 నుంచి మొదటి విడత తనిఖీ ఉంటుందని తెలిపారు. ఆదిలాబాద్ పార్లమెంటరీ పరిధిలో 12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గంలో 128, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 29 మంది హోం ఓటింగ్ వినియోగించుకోనున్నారని పేర్కొన్నారు. సమీకృత ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న సీ విజిల్ యాప్‌కు ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తెలిపారు. ఈ నెల 3 నుంచి రాజకీయ పార్టీలు జిల్లా రెవెన్యూ కార్యాలయానికి రావొచ్చని, ఈవీఎం కమీషనింగ్ కార్యక్రమాన్ని త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. ఒక్కో నియోజకవర్గానికి వంద చొప్పున బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు రావాల్సి ఉందని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్లు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించామని తెలిపారు. సమావేశంలో డీఆర్వో లోకేశ్వర్, తహసీల్దార్ దేశ్‌పాండే, ఎన్నికల సూపరింటెండెంట్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడు ఫెసిలిటేషన్ సెంటర్లు

- నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు
- 3 నుంచి పోస్టల్ బ్యాలెట్ వినియోగం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న ఉద్యోగులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ముందస్తుగా తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందుకోసం నియోజకవర్గానికి ఒకటి చొప్పున పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏడు ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లుగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గానికి సంబంధించి కాగజ్‌నగర్ ఆర్డీవో కార్యాలయం, ఆసిఫాబాద్‌కు సంబంధించి అక్కడి ఆర్డీవో కార్యాలయం, ఖానాపూర్‌కు ఉట్నూర్ ఆర్డీవో కార్యాలయం, ఆదిలాబాద్‌కు పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల శాంతినగర్, బోథ్ నియోజకవర్గానికి బోథ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నిర్మల్‌కు అక్కడి ఆర్డీవో కార్యాలయం , ముధోల్ నియోజకవర్గానికి సంబంధించి భైంసా ఆర్డీవో కార్యాలయంలో ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. ఈ నెల 3 నుంచి 8వరకు ఆయా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎన్నికల ఉద్యోగులు, సిబ్బంది తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చని సూచించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా కేంద్రాల్లో వసతులు ఏర్పాటు చేస్తున్నట్లుగా అధికారులు పేర్కొన్నారు.

గడువులోగా పనులు పూర్తిచేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



కౌటాల: పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కౌటాల/బెజ్జూర్: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో చేపట్టిన అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని గురుడుపేట, కన్నెపల్లి, బెజ్జూర్ మండలంలోని కొత్తగూడ ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులను మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యతతో చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వేసవి సెలవుల్లో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోగా పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయా పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఎంఈవోలు డి.సోమయ్య, రమేశ్‌బాబు, అసిస్టెంట్ ఇంజనీర్లు ప్రవీణ్ కుమార్, మగ్బూల్, పంచాయతీ కార్యదర్శులు ఎస్.సాయికృష్ణ, తిరుపతి, టి.సాయికృష్ణ, సునీత తదితరులు ఉన్నారు.

షాడో పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

- అదనపు కలెక్టర్ దాసరి వేణు

ఆసిఫాబాద్‌అర్బన్: షాడో పోలింగ్ కేంద్రాల్లో పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అదనపు కలెక్టర్(రెవెన్యూ) దాసరి వేణు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావుతో కలిసి పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి నెట్‌వర్క్ అందుబాటులోని 61 కేంద్రాలను షాడో పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామని తెలిపారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వైర్‌లెస్ సెట్లపై పంచాయతీ కార్యదర్శులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ రోజు ప్రతీ రెండు గంటలకు పోలింగ్ శాతాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్, కమ్యూనికేషన్ అధికారి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ భూతం!

తిర్యాణి మండల కేంద్రానికి చెందిన రాకేశ్(పేరు మార్చాం) ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో ఇప్పటివరకు దాదాపు రూ.లక్ష వరకు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పెట్టి డబ్బులు పోగొట్టుకున్నాడు. ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే సంపాదించుకోవాలని అనే ఆలోచనతో తెలిసిన మిత్రులు, బంధువుల వద్ద రూ.వేలల్లో అప్పు చేసి మరి మళ్లీ బెట్టింగ్ పెడుతున్నాడు. ఇలా జిల్లాలో యువకులు బెట్టింగ్‌కు అలవాటు పడి అప్పుల పాలవుతున్నారు.

- గ్రామీణ ప్రాంతాలకు విస్తరించిన విష సంస్కృతి
- ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లోనూ బెట్టింగ్
- నిషేధిత యాప్‌లు వినియోగిస్తున్న యువత
- చేతులు మారుతున్న రూ.లక్షల నగదు
- ఆర్థికంగా నష్టపోయి అప్పులపాలు



రెబ్బెన మండలంలోని యువకులు వినియోగిస్తున్న ఓ బెట్టింగ్ యాప్

తిర్యాణి(ఆసిఫాబాద్): పట్టణాలకే పరిమితమైన బెట్టింగ్(జూదం) సంస్కృతికి మొబైల్ ఫోన్ల వినియోగం పెరగడంతో గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది. ఈజీ మనీకి అలవాటు పడిన కొంతమంది యువకులు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ బెట్టింగ్ పెడుతూ ఆర్థికంగా నష్టపోతున్నారు. జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. వివిధ యాప్‌లు వినియోగిస్తుండటంతో పోలీసులకు సైతం పట్టు బడటం లేదు. యాప్‌ల నిర్వాహకులు, బుకీల వ్యాపారం మాత్రం మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న తీరుగా వర్ధిల్లుతోంది. రాష్ట్రవ్యాప్తంగా నిషేధించిన బెట్టింగ్ యాప్‌లను సైతం తప్పుడు లొకేషన్లు పెట్టి వినియోగిన్నారు. ఇటీవల కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన యువకులు ఆన్‌లైన్ జూదం ఆడుతూ పోలీసులకు పట్టుబడారు.

ఆన్‌లైన్ చెల్లింపులు

ప్రస్తుతం ఐపీఎల్ మ్యాచ్‌లు జోరుగా సాగుతున్నాయి. ప్రతిరోజూ ఒక మ్యాచ్, వారాంతాల్లో రోజుకు రెండు మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. టీంలోని క్రీడాకారులు, గత మ్యాచ్‌లో సదరు టీం ప్రదర్శన ఆధారంగా పెద్ద జట్టు, చిన్న జట్టుగా విభజిస్తున్నారు. విజయ అవకాశాలు ఉన్న పెద్ద జట్టుపై చిన్న జట్టు గెలిస్తే 150 శాతం చెల్లిస్తారు. ఈ లావాదేవీలు అధికంగా ఈ- వ్యాలెట్ ద్వారా చెల్లిస్తున్నారు. ఫోన్ వినియోగం పెరగడంతో ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం తదితర యూపీఐ యాప్‌ల ద్వారా ఆన్‌లైన్ లావాదేవీలు చేస్తున్నారు. మరో 10- 15 శాతం మాత్రం నేరుగా చేతులు మారుతోంది. ప్రతిరోజూ మ్యాచ్ ప్రారంభంలోనే మ్యాచ్ టు మ్యాచ్ పందెం కాస్తున్నారు. రెండు జట్ల మధ్య జరుగుతున్న పోటీలో ఏ జట్టు గెలుస్తుందనే దానిపై రూ.1000 నుంచి రూ.30 వేల వరకు పందెం పెడుతున్నారు. అలాగే ఏ బ్యాట్స్‌మెన్ ఎన్ని పరుగులు చేస్తాడు.. ఏ బౌలర్ ఎన్ని వికెట్లు పడగొడతాడు.. అనే దానిపై కూడా బెట్టింగ్ నడుస్తోంది. బెట్టింగ్‌లో గెలిస్తే రెట్టింపు డబ్బులు వస్తాయనే ఆశతో యువకులు ఆసక్తి చూపుతున్నారు. కొంతమంది యువకులు ఒకేచోట చేరి మద్యం తాగుతూ బెట్టింగులకు పాల్పడుతున్నారు.

నిషేధిత యాప్‌లు.. యథేచ్ఛగా వినియోగం

రాష్ట్రంలో ఏడేళ్ల క్రితం గేమింగ్ యాక్టు కింద ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రభుత్వం నిషేధించింది. అయినా డ్రీమ్ 11, మై సర్కిల్ 11, డఫ్పా, తదితర యాప్‌లను యువకులు తమ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకుంటున్నారు. లొకేషన్ మాత్రం హర్యానా, మహారాష్ట్ర వంటి ప్రాంతాలుగా మార్చి బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ఈ యాప్‌ల్లో రూ.25 నుంచి మొదలుకుని రూ.20 వరకు పందెం కాసేందుకు అవకాశం కల్పిస్తున్నారు. కొన్ని యాప్‌ల్లో మ్యాచ్‌లో తలపడే రెండు జట్ల నుంచి 11 మంది ఆటగాళ్లతో ఒక టీంగా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఎంచుకున్న జట్టు సభ్యుల ఆట తీరును బట్టి నిర్వాహకులు పాయింట్లు కేటాయిస్తారు. సాధించిన పాయింట్ల ఆధారంగా నగదు అందజేస్తున్నారు. హెడ్ టూ హెడ్‌తో పాటు, గ్రూప్ బెట్టింగ్ సైతం పెట్టుకోవచ్చు. మరికొన్ని యాప్‌ల్లో టాస్ వేసినప్పటి నుంచి మ్యాచ్ చివరి బంతి వరకు.. అంటే టాస్ ఎవరు గెలుస్తారు.. ఏ ఓవర్‌ల్లో ఏ బ్యాట్‌మెన్ ఎన్ని పరుగులు సాధిస్తారు.. ఒక జట్టు మొత్తం ఎంత స్కోర్ కొట్టగలదు.. ఇలాంటి అంచనాలతో కూడా ముందుగానే బెట్టింగ్ కాస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన యువకులు సైతం గతంలో బెట్టింగ్ ఆడుతూ పోలీసులకు చిక్కారు.

ఐపీఎల్ మ్యాచ్‌లకు క్రేజ్..

ప్రస్తుతం యువత ఎక్కువగా క్రికెట్ వైపే మక్కువ చూపుతోంది. చిన్నపిల్లల నుంచి మొదలుకొని పెద్దల వరకు అందరూ ఈ ఆటను ఇష్టపడుతున్నారు. అందులోనూ టీ20 ఫార్మట్‌లో ఉండే ఐపీఎల్ మ్యాచ్‌లకు మరింత క్రేజ్ ఉంటుంది. యువత ఇష్టాన్ని, బెట్టింగ్ సంస్కృతిని కొందరూ వ్యాపారంగా మార్చుకుంటున్నారు. రెండు వర్గాల మధ్య మధ్యవర్తిత్వం చేసి బెట్టింగ్ మొత్తం నుంచి 5 నుంచి 10 శాతం వరకు కమీషన్లు తీసుకుంటూ లాభాలు గడిస్తున్నారు. జిల్లాలో ఎక్కువగా కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, జన్కాపూర్, రెబ్బెన, గోలేటి, వాంకిడి, కెరమెరి, కౌటాలతో పాటు తిర్యాణి వంటి మారుమూల ప్రాంతాల్లోనూ యువత బెట్టింగ్‌లకు బానిసలుగా మారారు.

కఠినంగా వ్యవహరిస్తాం



జిల్లాలో అన్నిరకాల బెట్టింగ్‌లపై కఠినంగా వ్యవహరిస్తాం. నిషేధిత యాప్‌ల్లో బెట్టింగ్‌లకు పాల్పడితే శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. ఎంతటి వారినైనా ఉపేక్షించం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో బెట్టింగ్ పెడుతున్నారనే సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలి. సమాచారం ఇచ్చిన వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– సదయ్య, డీఎస్పీ, ఆసిఫాబాద్

క్లుప్తంగా

పాముకాటుకు వృద్ధురాలు మృతి

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన కామెర భూమక్క(75) పాముకాటుకు మృతి చెందినట్లు ఎస్సై భూమేష్ తెలిపారు. ఈ నెల 27న వృద్ధురాలు తన ఇంటి వద్ద పనిచేసే క్రమంలో నాగుపాము కాటేసింది. గమనించిన కుటుంబ సభ్యులు దండేపల్లి పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు పోషం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నగదు పట్టివేత

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట చెక్ పోస్టు వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో రూ.58,400 నగదు పట్టుకున్నట్లు ఎస్సై భూమేష్ తెలిపారు. ఆదిలాబాద్ నుంచి ధర్మారం వైపు వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా నగదు పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎస్ఎస్‌టీ టీం ఇన్‌చార్జి విక్రమ్‌రెడ్డి, ఏఎస్సై పున్నం, హెడ్ కానిస్టేబుల్ లింగన్న, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కార్డన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న గుడుంబా సామగ్రి

చింతలమానెపల్లి: మండలంలోని లంబడిహేట్టి, గుప్పగూడెం గ్రామాల్లో మంగళవారం డీఎస్పీ కరుణాకర్, కౌటాల సీఐ సాధిక్ పాషా ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ప్రతీ ఇంటిని తనిఖీ చేసి గుడుంబా తయారు చేస్తున్న 13 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. గుడుంబా తయారు చేస్తున్న జర్పుల రవి, ధరావత్ జమునాబాయి, బానోత్ సోనిబాయి, ధరావత్ కళావతి, జర్పుల శ్యామ్‌లాల్, అజ్మీర పద్మ, జాటోత్ లాలు, పరశురాం, మంగిలాల్, రవి, బానోత్ సోనిబాయిలపై కేసు నమోదు చేశామన్నారు. 2వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 90 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో బంగారు పతకం



బంగారు పతకంతో అక్షిత

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కె) గ్రామానికి చెందిన అక్షిత జాతీయస్థాయి సౌత్‌జోన్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఈ నెల 28, 29, 30 తేదీలలో కర్ణాటక రాష్ట్రంలో నిర్వహించిన పోటీల్లో తెలంగాణ జట్టులో ఆదిలాబాద్ జిల్లా తరఫున పోటీల్లో పాల్గొంది. 10–0 పరుగుల తేడాతో గెలుపొందిన తెలంగాణ జట్టు బంగారు పతకం సాధించింది. పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన అక్షితను బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, గస్కకంటి గంగాధర్, గొడం జ్యోతిరాం, తదితరులు అభినందించారు.

'ఆయన' గెలిచారు.. ఆమెకు తెలియదు



2004లో ఎంపీలు కేసీఆర్, ఆలె నరేంద్ర, వినోద్ కుమార్, రవీందర్ నాయక్‌లతో మధుసూదన్‌రెడ్డి (ఫైల్)

- ఎంపీగా మధుసూదన్‌రెడ్డి ఎన్నిక
- అప్పటికే ఆయన భార్య కోమాలో..
- మూడేళ్ల తర్వాత అదే పరిస్థితిలో మృతి

సాక్షి, ఆదిలాబాద్: జీవితంలో ఎవరైనా ఏదైనా సక్సెస్ సాధిస్తే మొదట కుటుంబ సభ్యులతో ఆనందం పంచుకుంటారు.. అయితే మాజీ ఎంపీ మధుసూదన్‌రెడ్డికి మాత్రం ఈ సంతోషం పంచుకునేందుకు ఆ అవకాశం లేకుండా పోయింది.. ఆయన భార్య అప్పటికే విగత జీవి.. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా ఆయన పేరు ఖరారైన తర్వాత కొద్ది రోజులకు ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు కారులో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా తుప్రాన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె తీవ్ర గాయాల పాలై కోమాలోకి వెళ్లిపోగా ఆయన స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మార్చిలో ఈ ప్రమాదం జరగగా ఏప్రిల్‌లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. మూడేళ్ల తర్వాత ఆయన ఎంపీగా ఉన్న కాలంలోనే ఆమె అదే పరిస్థితిలో ఈ లోకం విడిచి వెళ్లిపోయింది.

న్యాయవాద వృత్తి నుంచి..

ఆదిలాబాద్‌లో టి.మధుసూదన్‌రెడ్డి అప్పటికే దశాబ్దాలుగా ప్రముఖ న్యాయవాదిగా పేరు గడించారు. అప్పుడు 58 ఏళ్ల మధ్య వయస్సు.. భార్య భూలక్ష్మి, అప్పటికే పెళ్లిళ్లు జరిగిన కుమారుడు ప్రకాష్‌రెడ్డి, కూతురు సంగీత, మనుమలు, మనుమరాళ్లతో సంతోషంగా గడుపుతున్నారు. 2004లో ఆయనకు బీఆర్ఎస్ నుంచి ఆదిలాబాద్ ఎంపీ టిక్కెట్ ఖరారైంది. మార్చి 1న ఆయన ఆదిలాబాద్‌కు చెందిన ఓ న్యాయవాది కూతురి వివాహం హైదరాబాద్‌లో ఉండడంతో మధుసూదన్‌రెడ్డి భార్య భూలక్ష్మితో కలిసి కారులో డ్రైవర్‌తో సహా బయల్దేరి వెళ్లారు. అయితే మార్గమధ్యలో మధుసూదన్‌రెడ్డి కారు నడుపుతుండగా భార్య ముందర కూర్చుంది. డ్రైవర్ వెనుక సీటులో ఉన్నాడు. తుప్రాన్ వద్ద అనుకోని పరిస్థితిలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. భూలక్ష్మికి తీవ్ర గాయాలు కాగా మధుసూదన్‌రెడ్డికి మెడ వద్ద స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఈ ఇద్దరిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అయితే భూలక్ష్మి కోమాలోకి వెళ్లిపోయింది. మధుసూదన్‌రెడ్డి చికిత్స అనంతరం తేరుకున్నారు. ఏప్రిల్ 20న 14వ లోక్‌సభ మొదటిదశ ఎన్నికలు జరిగాయి. మే 13న ఫలితాలు వెలువడ్డాయి. బీఆర్ఎస్ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి 4,15,429 ఓట్లు, టీడీపీ అభ్యర్థి వేణుగోపాల్‌చారి 3,74,455 ఓట్లు సాధించారు. ఆదిలాబాద్ ఎంపీగా మధుసూదన్‌రెడ్డి గెలిచారు. ప్రముఖ న్యాయవాదిగా తన విజయాన్ని చూసిన భాగస్వామి భూలక్ష్మి ప్రజాప్రతినిధిగా ఎంపికయ్యారన్న విషయం కూడా తెలియకుండానే కోమాలోనే 2007లో ఆమె కన్ను మూశారు.



భార్య భూలక్ష్మితో మధుసూదన్‌రెడ్డి (ఫైల్)

మొదటిసారి ఎన్నికల్లో..

బీఆర్ఎస్ (టీఆర్ఎస్) పార్టీ 2001 సంవత్సరంలో ఆవిర్భవించింది. 2004 సాధారణ ఎన్నికల్లో యూపీఏ భాగస్వామ్య పార్టీలతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లో పోటీ చేసింది. కాంగ్రెస్, వామపక్ష పార్టీలతో కలిసి రాష్ట్రంలో పోటీ చేసింది. కొత్త పార్టీగా ఆ ఎన్నికల్లో 26 అసెంబ్లీ స్థానాలతో పాటు ఐదు పార్లమెంట్ స్థానాల్లో గెలుపొందింది. ఈ ఎన్నికల్లోనే ఆదిలాబాద్ ఎంపీగా మధుసూదన్ రెడ్డి గెలిచారు. ఆ ఐదుగురు ఎంపీల్లో పార్టీ అధినేత కేసీఆర్ కరీంనగర్ నుంచి గెలుపొందగా మెదక్ నుంచి ఆలె నరేంద్ర, హన్మకొండ నుంచి బి.వినోద్ కుమార్, వరంగల్ నుంచి దరావత్ రవీందర్ నాయక్ ఉన్నారు. దేశంలో యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రత్యేక రాష్ట్ర సాధన ధ్యేయమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీకి ఉండగా, ఆ దిశగా యూపీఏ ప్రభుత్వం నుంచి ఎలాంటి ముందడుగు లేకపోవడంతో 2006లో బీఆర్ఎస్ యూపీఏ నుంచి వైదొలిగింది. పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామా చేశారు. అందులో మధుసూదన్‌రెడ్డి కూడా ఉన్నారు. 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో మధుసూదన్‌రెడ్డి తిరిగి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆదిలాబాద్ నుంచి పోటీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డి చేతిలో ఆయన ఓటమి పాలయ్యారు. దీంతో కృంగిపోకుండా ఆయన తిరిగి న్యాయవాది వృత్తి చేపట్టడం గమనార్హం. 2015లో ఆయన గుండెపోటుతో మృతి చెందారు.

గురుకులాల్లో 98.91 శాతం ఉత్తీర్ణత

- ఆదిలాబాద్ రీజియన్‌లో 8 గురుకులాల్లో వందశాతం ఫలితాలు
- గతంలో కన్నా ఎంతో మెరుగు

బెల్లంపల్లి: పదోతరగతి వార్షిక ఫలితాల్లో ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యార్థులు 98.91 శాతం ఉత్తీర్ణత సాధించారు. రీజియన్ వ్యాప్తంగా 17 గురుకులాలు ఉండగా ఎనిమిదింటిలో వందశాతం ఉత్తీర్ణత సాధించగా 9 గురుకులాలు కేవలం 2 నుంచి 3 శాతం తేడాతో వందశాతం కోల్పోవాల్సి వచ్చింది. ఓవరాల్‌గా రీజియన్ నుంచి 1,287 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,273 మంది ఉత్తీర్ణులుకాగా కేవలం 14 మంది అనుత్తీర్ణులయ్యారు. గతంలో కన్నా భిన్నంగా ఈసారి సంక్షేమ గురుకులాలు 'పది' ఫలితాల్లో రాణించడం విశేషం.

వందశాతం సాధించిన గురుకులాలు

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలు ఉన్నాయి. వీటి పరిధిలో 17 గురుకులాలు ఉన్నాయి. ఆదిలాబాద్‌లోని సీఓఈ బాలికల గురుకుల విద్యాలయం, ఇచ్చోడ బాలుర గురుకులం వందశాతం ఫలితాలు సాధించి సత్తా చాటాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలో రెబ్బెన (బాలికలు), కాగజ్‌నగర్(బాలికలు), సిర్పూర్ (టీ) బాలుర గురుకులాలు శతశాతం ఫలితాలతో రాణించి జయకేతనం ఎగుర వేశాయి. మంచిర్యాల జిల్లాలోని జైపూర్, బెల్లంపల్లి (సీఓఈ), కోటపల్లి బాలుర గురుకులాలు మెరుగైన ఫలితాలతో మెరిశాయి.

మిగతా గురుకులాల్లో ఉత్తీర్ణత

బోథ్ సంక్షేమ బాలికల గురుకులంలో 97.40 శాతం, సిర్పూర్ (టీ) బాలికల గురుకులంలో 98.40 శాతం, లక్సెట్టిపేట బాలికల గురుకులంలో 97.37 శాతం, బెల్లంపల్లి బాలికల గురుకులంలో 98.65 శాతం, చెన్నూర్ బాలికల గురుకులంలో 97.40 శాతం, మందమర్రి బాలికల గురుకులంలో 98.68 శాతం, ఆసిఫాబాద్ బాలుర గురుకులంలో 97.22 శాతం, కాసిపేట బాలుర గురుకులంలో 98.53 శాతం, మంచిర్యాల బాలుర గురుకులంలో 97.26 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

'గోమాస'కే నేతకానీల మద్దతు



మాట్లాడుతున్న నేతకాని మహార్ హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు

శ్రీరాంపూర్: పెద్దపెల్లి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గోమాస శ్రీనివాస్‌కే తమ కుల సంఘం మద్దతు ఉంటుందని నేతకాని మహార్ హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆ సంఘం జాతీయ స్టీరింగ్ కమిటీ చైర్మన్ కనకయ్య, రాష్ట్ర అధ్యక్షుడు రాయమల్లు మాట్లాడారు. తమ సంఘం జాతీయ అధ్యక్షుడు గోమాసకు సంఘం తరపున మద్దతిస్తూ ఆయన గెలుపునకు కృషి చేస్తున్నామన్నారు. తమ కులం పేరుతో కొందరు వ్యక్తిగత స్వలాభం కోసం కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతిస్తున్నట్లు ప్రకటించారని, దీనికి తమ కులానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఏనాడు దళితులను పట్టించుకోని వెంకటస్వామి కుటుంబానికి తామెలా మద్దతిస్తామన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు దుర్గం ఎల్లయ్య, నాయకులు దుర్గం నరసయ్య, నగేష్, రాంటెంకి శేఖర్, ప్రభాకర్, దామోదర్, శేషగిరి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

రెబ్బెన(ఆసిఫాబాద్): నిర్ణీత వయస్సు రాకముందే బాల్య వివాహాలు జరిపించడం చట్టరీత్యా నేరమని డీసీపీవో బూర్ల మహేష్ అన్నారు. మండలంలోని కొండపల్లిలో ఓ బాలికకు వివాహం జరిపించేందుకు తల్లిదండ్రులు నిర్ణయించగా విషయం తెలుసుకున్న జిల్లా బాలల సంరక్షణ అధికారులు మంగళవారం గ్రామానికి వెళ్లి బాలిక తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. మైనర్లకు వివాహం చేయడం ద్వారా ఎదురయ్యే సమస్యలను వివరించారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహాలు జరిపించాలని, లేనిపక్షంలో బాల్య వివాహాల నిషేధ చట్టం 2006 ప్రకారం కేసులు నమోదు చేసి చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా బాల్య వివాహాలు జరిపిస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అజర్ అలీ, బాల రక్ష భవన్ సిబ్బంది బాల ప్రవీణ్‌కుమార్, చంద్రశేఖర్, ప్రవీణ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ సంతోషి, తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిలింగ్ ఇస్తున్న అధికారులు

క్రీడా శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

శ్రీరాంపూర్: వేసవిలో సింగరేణి అందిస్తున్న క్రీడా శిక్షణ సద్విని చేసుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం (పర్సనల్) అరవిందరావు అన్నారు. మంగళవారం ప్రగతి మైదానంలో వేసవి క్రీడా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిష్ణాతులైన శిక్షకులతో ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్ బాక్సింగ్, బాస్కెట్‌బాల్ క్రీడల్లో 25 రోజులపాటు శిక్షణ అందిస్తున్నామన్నారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలు ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, కంపెనీ స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాల్ సృజన్, సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కోఆర్డినేటర్ తోట సురేష్, తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న డీజీఎం అరవిందరావు

'మనువాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా మే డే'

మంచిర్యాలక్రైం: మనువాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా మేడే జరుపుకుందామని సింగరేణి శ్రామిక శక్తి గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు ఎం.పోచమల్లు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కార్మికులు పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలను నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేసి 4 చట్టాలుగా క్రోఢీకరించాయన్నారు. దీంతో అనేక కంపెనీలు సగానికి పైగా కార్మికుల హక్కులను కాలరాసాయన్నారు. అందుకే నేడు నిర్వహించే మేడేను మనువాద ఫాసిస్టు ప్రమాదానికి వ్యతిరేకంగా జరుపుకుందామన్నారు.

కదిలిన అధికార యంత్రాంగం

- లైన్‌మెన్లతో సమావేశమైన ఏడీ, ఏఈ



సమావేశంలో పాల్గొన్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

చెన్నూర్: 'అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయ ఆవరణలో ఏడీ రవికుమార్, ఏఈ శ్రీనివాస్ లైన్‌మెన్లతో సమావేశం ఏర్పాటు చేశారు. యుద్ధ ప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సమస్య తలెత్తితే లైన్‌మెన్‌లు తక్షణమే స్పందించాలన్నారు. సమస్య పెద్దదయితే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

'రాజ్యాంగాన్ని మారిస్తే రిజర్వేషన్లు కోల్పోతాం'

మంచిర్యాలటౌన్: బీజేపీ రాజ్యాంగాన్ని మారుస్తామంటోందని, మాదిగలు రిజర్వేషన్లు కోల్పోతారని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. మంగళవారం స్థానికంగా ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు తాము వ్యతిరేకం కాదని, మందకృష్ణ మాదిగ తమ కుటుంబంపై రాజకీయాలను చేస్తున్నారని ఆరోపించారు. బాల్క సుమన్ చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. అనంతరం పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా ఎమ్మార్పీఎస్, మాదిగ రిజర్వేషన్ పోరాట హక్కుల సమితి, మంచిర్యాల జిల్లా యాదవ సంఘాలు తీర్మానం చేశారు.

'మాదిగలను ఓటు అడిగే హక్కు బీజేపీకి లేదు'

తాండూర్: మాదిగలను ఓటు అడిగే హక్కు బీజేపీకి లేదని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్‌మాదిగ అన్నారు. మంగళవారం తాండూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ నేటికీ నెరవేర్చలేదని విమర్శించారు. మాదిగల ఓట్లు దండుకోవడం తప్పా చేస్తున్నదేమీ లేదన్నారు. మాదిగ యువతకు ఉద్యోగావకాశాలు కలగాలంటే కాంగ్రెస్ పార్టీని ఎన్నికల్లో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుశ్నపల్లి నారాయణ, నాయకులు వడ్లూరి శ్రీనివాస్, కడారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మేడే ఘనంగా జరుపుకోవాలి

బెల్లంపల్లి:ప్రపంచ కార్మికుల పర్వదినమైన మేడేను కార్మికులు ఘనంగా జరుపుకోవాలని టీఎస్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి టీ.మణిరాం సింగ్ కోరారు. మంగళవారం మందమర్రి శాంతిఖని గనిపై మేడే వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గద్దల నారాయణ, హాసన్, మల్లయ్య, తిరుపతి, చంద్రమౌళి, నవీన్‌కుమార్, ఖాశీం, కార్మికులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకకు అవకాశం ఇవ్వండి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జన్నారం: ప్రజా సమస్యలపై స్పందించి, పరిష్కరించడమే కాకుండా ఎవ్వరినైనా ప్రశ్నించే గొంతుక, పేదింటి బిడ్డ ఆత్రం సుగుణను గెలిపించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం దేవునిగూడ, ఇందన్‌పల్లి, రేండ్లగూడ, మొర్రిగూడ, టీజీపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో మరింత అభివృద్ధి జరగాలంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో కలిసి పని చేశాడు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, నాయకులు రాజశేఖర్, సుభాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సయ్యద్ ఇషాక్, ఫసీఉల్లా, ఇందయ్య, రమేష్, శిరీష్, కంటెం శంకర్, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పథకాల పేరిట మోసగించిన కాంగ్రెస్

- పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

భీమారం/జైపూర్/శ్రీరాంపూర్: పథకాల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని పెద్దపల్లి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. మంగళవారం ఆయన ఆర్కే 6 గని, ఏరియా వర్క్‌షాప్, స్టోర్స్‌లలో కార్మికులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాత్రి భీమారం, జైపూర్ మండల కేంద్రాల్లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌ల్లో మాట్లాడారు. కార్మికుడిగా 26 ఏళ్లు పని చేసిన తనకు కష్టసుఖాలు తెలుసని, తనను గెలిపిస్తే కార్మికుల గొంతును పార్లమెంట్‌లో వినిపిస్తానని తెలిపారు. ఆగర్భ శ్రీమంతుడికి భూగర్భ గని కార్మికుడికి మధ్య ఎన్నికలుగా అభివర్ణించారు. ఎన్నికల ముందు లేని పోని హామీలు ఇచ్చిన సీఎం ఇప్పుడు అమలు చేయకుండా దాటవేత ధోరణిలో ముందుకెళ్తున్నారని ఆరోపించారు. ఇప్పటికీ రైతుబంధు పూర్తి స్థాయిలో ఇవ్వలేదని, ఆడపిల్లల పెళ్లికి తులం బంగారం ఇస్తామని చెప్పి ఒక్కరికీ ఇవ్వలేదని అన్నారు. చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ఓటు వేసి మళ్లీ మోసపోవద్దని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేస్తే ప్రజలకు రావాల్సిన హక్కుల కోసం పోరాటం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు విజిత్‌రావు, టీబీజీకేఎస్ నాయకులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, పెట్టం లక్ష్మణ్, పానుగంటి సత్తయ్య, భీమారం మండల పార్టీ అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

అడ్డగోలు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

రామకృష్ణాపూర్: అమలుకు సాధ్యంకాని అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు డాక్టర్ రాజారమేష్, గాండ్ల సమ్మయ్య, సుదర్శన్‌గౌడ్, జిలకర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న జీఎం బసివిరెడ్డి

జైపూర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎస్టీపీపీ జీఎం బసివిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో 'మిషన్ లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్' కార్యక్రమంలో భాగంగా పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపిక

మంచిర్యాలటౌన్: కాకతీయ యూనివర్సిటీలో జరిగిన అంతర్ జిల్లా సాఫ్ట్‌బాల్ సెలక్షన్ పోటీలలో మంచిర్యాల మిమ్స్ డిగ్రీ కళాశాలకు చెందిన ప్రథమ సంవత్సరం విద్యార్థి డి.డానియల్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.ఉపేందర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేలో బెంగళూరులో నిర్వహించే ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికై నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ టి.శ్రీనివాస రాజు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, పీడీ నూనె శ్రీనివాస్ విద్యార్థిని అభినందించారు.



పోటీలకు ఎంపికైన డానియల్

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

చెన్నూర్: ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీవో, ఏపీవోలకు వీవీప్యాట్లు, ఈవీఎంలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ సమయానికి ముందే పీవోలు, ఏపీవోలు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు.కార్యక్రమంలోఆర్వో చంద్రకళ, తహసీల్దార్లు మల్లికార్జున్, చంద్రశేఖర్, సదానందం పాల్గొన్నారు.

రైతులు ఇబ్బంది పడకుండా చూడాలి

చెన్నూర్‌రూరల్/జైపూర్: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ సూచించారు. చెన్నూర్ మండలం కిష్టంపేటలోవరి ధాన్యం కొనుగోలు కేంద్రం, జైపూర్ మండలం టేకుమట్లలో రైస్ మిల్లు, కిష్టాపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

నిర్వహణపై అవగాహన ఉండాలి

బెల్లంపల్లి: ఎన్నికల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. మంగళవారం బెల్లంపల్లిలోని సేయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ప్రతీ అంశంపై అధికారులు అవగాహన పెంచుకోవాలని తెలిపారు.

ఆదిలాబాద్ నిర్మాతకు అరుదైన గౌరవం

జైనథ్: జైనథ్ మండలంలోని ఆనంద్‌పూర్ గ్రామానికి చెందిన ప్రముఖ నిర్మాత గౌరికృష్ణ, డా.అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో శ్రీ కృష్ణ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మించిన మా ఊరి పొలిమేర–2 చిత్రానికి ప్రతిష్టాత్మకమైన దాదాసాహెబ్ ఫాల్కే జ్యూరీ అవార్డ్ వరించింది. సత్యం రాజేష్, డా.కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రాకేందు మౌళి, అక్షత, బాలాదిత్య, సాహితి దాసరి, రవి వర్మ, చిత్రం శ్రీను ముఖ్య తారాగణంగా తెరకెక్కిన ఈ చిత్రం గతేడాది నవంబర్ 2న విడుదలై మంచి కలెక్షన్లు రాబట్టింది. కాగా మంగళవారం న్యూఢిల్లీలో నిర్వహించిన 14వ దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌లో చిత్రం హీరోయిన్ డా.కామాక్షి భాస్కర్లకు బెస్ట్ యాక్ట్రెస్ జ్యూరీ అవార్డ్ దక్కింది. చిత్ర దర్శక నిర్మాతలు ఎక్సలెన్స్ సర్టిఫికెట్ అందుకున్నారు.